క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదవాలి

బంటుమిల్లి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని మోటివేషన్ ట్రైనర్లు బి. శివశంకర్, రమాశంకర్ అన్నారు. మల్లపరాజుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రైనర్లను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

మచిలీపట్నంటౌన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత స్కాట్స్ అండ్ గైడ్స్ క్యాంపు ఆఫీసులో ఎల్ఐసీ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ట్రెనింగ్ సెంటర్ మచిలీపట్నం డివిజన్ మేనేజర్ కేపీ రామకృష్ణ, పీఅండ్ఐఆర్ మేనేజర్ వి. రమణ, ప్రాడెక్ట్ మేనేజర్ వేణుమాధవ్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. 40 ఏళ్ల కిందట తాను కూడా స్కాట్ విద్యార్థిగా ఉండేవాడినని రామకృష్ణ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్ శోభన్‌కుమార్, డి. విజయలక్ష్మీ, సీహెచ్ సుభాషిణి, జి. వీరకుమారి, ఎ. అశోక్‌కుమార్, కె. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంఘ భవనంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన గౌతమీ నేత్రాలయం నేత్ర వైద్య నిపుణుడు రాజేష్ 16 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని రాజమండ్రి తీసుకువెళ్లి అక్కడి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి చేబ్రోలు ఆశీర్వాదం, ఉపాధ్యక్షుడు రాఘవరావు, కోశాధికారి శంకరరావు, జాయింట్ సెక్రటరీ బీకే దుర్గారావు, గౌతమీ నేత్రాలయం ప్రోగ్రాం మేనేజర్ భానుసతీష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి

గంజివానిపాలెం(మోపిదేవి): జాతీయ గ్రామీణ ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి జరుగుతోందని వార్డు సభ్యురాలు బడుగు భారతి, బూచి దిలీప్ అన్నారు. మండల పరిధిలోని గంజివానిపాలెం దళితవాడలో అంతర్గత రహదారులలో ముళ్లకంపను బుధవారం తొలగించారు. వారు మాట్లాడుతూ ముళ్లకంపతో మూసుకుపోయిన రహదారులన్నీ ఉపాధి పనుల కింద తొలగించామని చెప్పారు. చెత్త, ముళ్లకంప బయటకు తరలించేందుకు పంచాయతీ వారు ట్రాక్టర్ కేటాయించడంతో గ్రామంలో పూర్తిస్థాయిలో చెత్త తొలగించి స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దామని తెలిపారు.

వరాహాలను తరలించండి

పెడన: పట్టణానికి దూరంగా పందులను తరలించాలని పెంపకం దారులకు మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య సూచించారు. బుధవారం కమిషనర్ తన చాంబర్‌లో పందుల పెంపకందారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జనావాసాల్లో పందులను పెంచవద్దని గతంలో మీకు చెప్పామన్నారు. పట్టణంలో పందులు ఆకస్మికంగా చనిపోతున్నాయని, ఎందుకు ఇలా జరుగుతోందని ప్రశ్నించారు. తక్షణం వాటిని సంరక్షించుకుని దూరంగా తరలించాలని సూచించారు. పట్టణానికి దూరంగా స్థలం చూపిస్తే వెళ్లిపోతామని పెంపకందారులు తెలిపారు. ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



కోడూరు: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయంలోని వాసవీ అమ్మవారి ఉపాలయంలో మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరెను సమర్పించారు. సామూహిక కుంకుమార్చన జరిగింది. వాసవీ అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఓటుతో మెరుగైన సమాజం నిర్మాణం

పెడన: జాతీయ ఓటరు దినోత్సవం మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ఓటర్ల దినోత్సవం, ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు జరిగాయి. మరికొన్ని చోట్ల ప్రతిజ్ఞలు చేశారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఓటు అమూల్యమైనదని, ఓటు వినియోగంతో సమర్థులైన పాలకులను ఎన్నుకునే అవకాశం కలుగుతుందని, మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చని వివరించారు.

● **గూడూరు:** గూడూరులో జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఓటు హక్కుపై ప్రజలను చైతన్య పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ బి. విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. సందర్భంగా పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

మోపిదేవి: తహసీల్దార్ కె. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ఓటు హక్కు విలువపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, పౌరులతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్స్ కంబాల శ్రీరాములు, కొలుసు వెంకట్రామయ్య, నందిగం సకలేశ్వరరావు, కర్రా పోతురాజు, డొక్కా నీలంబర్‌లకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. డీటీ శివరామకృష్ణ, రెవెన్యూ అధికారులు మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వోలు మూర్తి, శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం జయంతి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **మచిలీపట్నంటౌన్:** అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 38వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఓటరును, జూనియర్ ఓటరును సత్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ ఎంతో విశిష్టమైనదని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

● **మచిలీపట్నంటౌన్:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. కుల, మత, జాతి, వర్గ, భాష వంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, గ్రంథ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

● **బంటుమిల్లి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.దేవజయరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి పాలకులను ఎంచుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో– ఆర్డినేటర్ బి. వేదాంతం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కోడూరు:** మండలంలోని 42 పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్ఓలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు జరిగాయి. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నూతనంగా ఓట్లు మంజూరైన వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించారు. విశ్వనాథపల్లి బూత్ వద్ద ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, కోడూరులో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ బహుమతులు అందించారు. తహసీల్దార్ లతీఫ్‌పాషా, ఆర్ఐ సుభాషిణి పర్యవేక్షించారు.

● **పెడన:** ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పాటు చేసుకోవచ్చునని ముడా వైస్ చైర్మన్ బి. సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెడన-గుడివాడ రోడ్డులోని షాదీఖానాలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందడానికి అర్హులని, ఆన్‌లైన్ ద్వారా ఆధారాలు సమర్పించి ఓటు హక్కు పొందవచ్చునని సూచించారు. అనంతరం పట్టణంలోని ఇద్దరు సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఎంఈఓ మెటల్దారాణి, ఎన్నికల విభాగం డీటీ కల్పన, సీనియర్ అసిస్టెంట్ శివశంకర్, ఆర్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **పెడన:** మండలంలోని మడక గ్రామ సచివాలయంలో సీనియర్ ఓటరు జన్ను నాంచారయ్యను, కొత్త ఓటరు జె. స్మైలీని సన్మానించారు. సర్పంచ్ జోగి వెంకటలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, గరికిపాటి వెంకట రామానాయుడు, బెజవాడ నాగబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● **చిలకలపూడి(మచిలీపట్నం):** ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ కిషోర్ నాయక్ అన్నారు. నోబుల్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. అటువంటి ఓటు హక్కును స్వార్ధ రహితంగా, ప్రలోభాలకు అతీతంగా వినియోగించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్‌జే ఎర్నెస్ట్ మాట్లాడుతూ ఓటు హక్కు మనిషి వ్యక్తిత్వంతో సమానమని, అటువంటి ఓటు హక్కును సద్వినియోగం చేయాలన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ సీతారామయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బందరులో సీనియర్, జూనియర్ ఓటర్లను సన్మానిస్తున్న దృశ్యం



పెడనలో సీనియర్ ఓటర్లను సన్మానించిన అధికారులు



గూడూరులో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ విజయ ప్రసాద్



మోపిదేవిలో సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ నవీన్‌కుమార్



విశ్వనాథపల్లిలో మహిళలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న బీఎల్ఓలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిశోర్ నాయక్

జగన్ పాలనలో అన్నివర్గాలకు మేలు



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

నడకుదురు(చల్లపల్లి): కుల,మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాలకు మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అందజేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాముడుపాలెం, నాదెళ్లవారిపాలెంల్లో బుధవారం నడకుదురు గ్రామ సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వికాస్ బాబు రెండు గ్రామాల్లో 388 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతూ, చేసిన మంచి గురించి ప్రతి ఇంటికీ వెళ్లి చెబుతూ, మీకు మంచి జరిగితేనే నాకు ఓటేయండి అని చెప్పే దమ్ము, ధైర్యం ఉన్న ముఖ్యమంత్రి ఈ దేశంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు వల్లూరు ఉమా, డొక్కు నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ డొక్కు దేవేంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రమేష్, సజ్జా బలరాం, కుందేటి కోటేశ్వరరావు, మోదుమూడి కుటుంబరావు, బొందలపాటి లక్ష్మి, బండారు ప్రవీణ్, దుర్గారావు, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలకు భావనాఋషి ఆలయం ముస్తాబు

28న భద్రావతీ సమేత భావనాఋషి, లక్ష్మీగణపతి విగ్రహాలు ప్రతిష్ట

కోడూరు: కోడూరు ఆరో వార్డులో సుమారు రూ.50 లక్షల వ్యయంతో భద్రావతీ సమేత భావనాఋషి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. స్వామివారి ప్రతిష్ఠోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భద్రావతీ, భావనాఋషి స్వామివారి విగ్రహాలతో పాటు లక్ష్మీగణపతి స్వామివార్ల విగ్రహాలను కూడా ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక మండపాలను నిర్మించారు. ఆలయ పై భాగంలో గణపతి, భావనాఋషి, భద్రావతీ అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని నూతన రంగులతో ముస్తాబు చేశారు. భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో ఆలయ నిర్మాణం చేపట్టామని కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్వామివార్ల విగ్రహాలను డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య ప్రత్యేక వాహనంపై కోడూరులో ఊరేగించారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు..

గురువారం ఉదయం 9 గంటలకు ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, త్రిశూల పూజ, శుక్రవారం ఉదయం వాస్తు, రుద్రహోమాలు, స్వామివార్లకు ధాన్యాదివాసము, శాంతిహోమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 9.39 లకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి, శాంతి కల్యాణాన్ని జరుపుతారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.



ప్రత్యేక వాహనంలో స్వామివార్ల విగ్రహాల ఊరేగింపు

గణతంత్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

కోనేరుసెంటర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జరగనున్న కార్యక్రమాలకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రానికి మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకలను వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. షామియానాలు, కుర్చీలను వేయించారు. ఈ ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎస్.వెంకట రామాంజనేయులు, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, బందరు తహసీల్దార్ డి.సునీల్ బాబు తదితరులు పర్యవేక్షించారు.



అతిథుల కోసం ముస్తాబైన ప్రధాన గ్యాలరీ

మహా శివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయండి

తహసీల్దార్ నవీన్‌కుమార్

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో మహా శివరాత్రి ఉత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరస్వామి వారి దేవస్థానం కల్యాణ మండపంలో అన్ని శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వార్లను దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్ష మందికి పైగా భక్తులు తరలివస్తారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ మాట్లాడుతూ పుష్ప ఘాట్స్ వద్ద ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ లైట్లు, బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని, పార్కింగ్, స్వామివారి దర్శనార్థం వచ్చే వీఐపీలు, భక్తులకు విడివిడిగా క్యూలైన్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఏసీ చక్రధరరావు మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామన్నారు. 17 నుంచి 19వ తేదీ అర్ధరాత్రి వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. 19వ తేదీ రాత్రి రథోత్సవం 8 గంటలకు ప్రారంభిస్తామని చెప్పారు. 18వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా తెల్లవారు జాము వైదిక కార్యక్రమాల అనంతరం ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని, సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో జగాజ్యోతి కార్యక్రమం అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతిస్తామని వివరించారు. అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, రేపల్లె, విజయవాడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు పెదకళ్లేపల్లికి నడుపుతామని తెలిపారు. ఎంపీడీఓ పార్వతి, సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ అరజా ఆశాదేవి, ఎస్ఐ పద్మ, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శి, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అధికారులు, పలు శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నవీన్‌కుమార్

3 నుంచి హంసలదీవి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



కోడూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 3వ తేదీన ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ సుధాకర్ గురువారం తెలిపారు. 3వ తేదీన ఉదయం స్వామి వారికి విశేష స్నపన, పెండ్లి కుమారుడిగా అలంకరణ, సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్ష స్వీకరణ, ఆఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. 4న ఉదయం బలిహరణ, పంచామృత స్నపన, క్షీరాభిషేకం, రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సాయంత్రం నిత్యహోమం, జగజ్యోతి, రాత్రి స్వామివారి కల్యాణం ఆరుబయట నిర్వహిస్తామన్నారు. 5న ఉదయం హంసలదీవి బీచ్, సాగర సంగమం వద్ద సింధు స్నానాలకు వచ్చే భక్తులతో ప్రత్యేక పూజలు, రాత్రి స్వామివారి రథోత్సవం, 6న అవభృథోత్సవం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, రాత్రి స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలను ముగుస్తాయని వివరించారు. ఉత్సవాలను ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని తెలిపారు.

మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్యకు నివాళి



కేపీ రెడ్డయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: బందరు మాజీ ఎంపీ కొలుసు పెద రెడ్డయ్యకు బుధవారం రాధా–రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రెడ్డయ్య సంస్మరణ సందర్భంగా స్థానిక రేవతి సెంటర్‌లోని వీఎం రంగా విగ్రహం వద్ద రెడ్డయ్య చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు మాట్లాడారు. కేపీ రెడ్డయ్య ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. రాధా–రంగా మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, కాపు సంక్షేమ సేన రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకట్రావు, బ్రాహ్మణ సంఘం నాయకుడు పీవీ ఫణికుమార్, జనసేన నాయకుడు బండి రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

● ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
● రూ.3.13 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. చల్లపల్లిలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.3.13 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బుధవారం ఉదయం స్థానిక పడమర వైపు ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద రూ.2 కోట్ల 13 లక్షల యాభై వేలతో ఇంటింటికీ కుళాయి పథకం పనులకు శంకుస్థాపన చేశారు. చల్లపల్లి నారాయణరావు నగర్‌లోని కమ్యూనిటీ స్థలంలో రూ.కోటితో నూతన ఓవర్ హెడ్ ట్యాంక్, వాటర్ స్కీం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న విస్తృత అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై సంపూర్ణ విశ్వాసంతో మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, డొక్కు నాగేశ్వరరావు, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, మేకా బంగారుబాబు, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ వీఎస్ఎస్ ప్రకాష్, ఏఈ భోగాది జగత్, పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, గ్రామ సచివాలయ కార్యదర్శులు తిరువీధుల రాజశేఖర్, ఎంఎస్‌పీ తిరుమలేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పీతా వంశీకృష్ణ, తాతా కార్తీక్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

బంటుమిల్లి: చినతుమ్మిడి, రామవరపుమోడి గ్రామాల్లో బుధవారం కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. రెండేళ్లుగా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలతో 12 శాఖల ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామాభివృద్ధికి, మౌలిక సౌకర్యాల కల్పనకు, పేదలకు ఉపాధి కల్పించేందుకు దోహదపడతాయని అధికారుల బృందం పేర్కొంది. ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంపీపీ వి. చినబాబు, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెస్ట్ సర్వేతో ప్రయోజనాలు

మండవల్లి : పెస్ట్ సర్వే వల్ల పలు ప్రయోజనాలు చేకూరుతాయని డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. అల్లినగరం గ్రామంలో డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పెస్ట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా పురుగుల ఉధృతి, ఆర్థిక నష్ట పరిమితిని అనుసరించి కషాయాలను వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కోనేరుసెంటర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతిచెందాడు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం ఆనందపేటకు చెందిన మాకర్ల తరుణ్ (21), గంజాల ధనుష్ స్నేహితులు. ఇరువురు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి ధనుష్, తరుణ్ కలిసి బైక్‌పై బయటికి వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ఆనందపేటకు సమీపంలోని డీమార్ట్ వద్ద గేదెలు రోడ్డుకు అడ్డు రావడంతో ఇరువురు బైక్‌పై నుంచి పడిపోయారు. ఈ ఘటనలో తరుణ్ తలకు బలమైన గాయాలు కాగా ధనుష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తరుణ్‌ను బందరు ప్రభుత్వాస్పత్రిలో చేరించగా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న తరుణ్ బుధవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మాకర్ల మధుసూదనరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.